## చనిపోదామనుకున్న ఆ ఇల్లాలిని పుత్రప్రేమ ఎలా కట్టివడేసింది?

# మంచుకొండ వగిలింది

పి.వి.శేషారత్నం కథ

**క**ళ్లు తెరుచుకునే నడుస్తున్నా ఆలోచన ఎక్కడో వుండడంవల్ల నిద్రలో నడుస్తున్నదానిలా వుంది అనూష. రోడ్డుమీద పోతున్న నలుగురైదుగురు ఆమెకేసి వింతగా చూసి ముందుకు సాగిపోయారు.

అనూష కదేం పట్టలేదు.

ఆమె చెవిలో ప్రశాంత మంద్రస్థాయిలో వినిపిస్తోందొక కంఠం.

ముద్దాయి అనూషపై మోపబడిన హత్యానేరం, నిరాధారమని నిరూపించబడినందున ఆమెను నిరపరాధిగా భావించి విడుదల చేయడమైనది.

తీర్పు చదివాక జడ్జిగారు కళ్లజోడులోంచి అనూషవైపొకసారి పరికించి ఆమె మొహంలో ఎటువంటి ఆనందమూ ద్యోతకం కాకపోవడంతో కాస్త విస్మయపడ్డారు.

ఈ ప్రపంచంలో ఇంతవరకు సానుభూతిగాని జాలిగాని చూపించిన ప్రాణి ఒక్కటీ లేదు.

తను విధివంచిత.

పుట్టుకతోనే మూగతనం తన పాలిట శాపంగా తన తల్లిదండ్రులపాలిట శోకంగా విధి ప్రసాదించింది.

బిడ్డ ముద్దు మాటలు విని ఆనందించవలసిన తల్లీ తండ్రీ వికారంగా తను చేసే వింత ధ్వనులకెంత కుమిలిపోయేవారో.

కన్నవాళ్లు కనుక తన అవకరాన్ని అవమానంగా భావించకపోయినా అన్నయ్యకీ, అక్కకీ తన ఉనికి భరించలేనిదిగా ఉండేది. కొన్నాళ్లు తోడబుట్టినదని సహించినా తోటి పిల్లలు ఆడుకుంటూ తనని వెక్కిరిస్తుంటే ఉడుకుబోతుతనం కలిగి ఆ కోపమంతా తన వీపుమీద రెండు గుద్దుల రూపంలో ముద్రించి మళ్లీ తను తల్లిదండ్రికి ఎక్కడ ఫిర్యాదు చేస్తుందోనని భయంతో పారిపోయేవారు.

తను చెప్పలేదని తెలిసి ఆదరించి, అభిమానించే



బదులు అదొక అలుసుగా తీసుకుని రానురాను తల్లీ, తండ్రీ లేనప్పుడు ఆటపట్టిస్తూ తనకొక సున్నితమైన మనసుంటుందనికూడా గుర్తించలేక తననొక ఆటబొమ్మలా చేసి

మూగతనం ఏ మగవాడికో అయితే అంత బాధపడేవారు కాదేమో. తను ఆడపిల్ల అయిపోవడంతో జీవితమంతా కూడా కాకుండా గుదిబండలా వుండిపో తుండ తొలిచేస్తుంటే

ఒకవైపు కన్నపేగు మరోపక్క నిస్సహాయతవల్ల తల్లీదండ్రీకూడా ముభావంగానే వుండేవారు.

భగవంతుడు తనకి ప్రసాదించిన ఒకే ఒక్క వరం అందం.

ఆ అందమే తన పాలిట శాపంలా తనకు సోదరీ ప్రేమను దూరం చేసింది. అక్కకు తనమీద రానురాను ద్వేషం పెరిగిపోయింది.

తను తలదువ్వుకోకపోయినా అందాల నొక్కుల జుట్టు బారెడు పొడవుతో నడుంమీద నాట్యమాడుతుంటే ఎలకతోకలాంటి జడతో వున్న తనని స్కూల్లో అంతా వెక్కిరిస్తున్నారని అక్క అమ్మతో చెప్పి ఏడ్చేది. చిదిమితే పాలుగారే తెల్లని మేనిఛాయ చూసి అక్క ఓర్చలేక గిల్లేసేది. కాని తను నోరువిప్పి ఒక్కనాడూ తల్లితో చెప్పలేదు.

ఎంతసేపూ చదువుకోవాలనే తపన. అదృష్టవశాత్తు సాహిత్యంమీద అభిలాష కలగడం తనకి జీవితంమీద ఆశను పెంచింది. కృష్ణశాస్త్రిగారి గేయాలు చదువుతూ ఆ చుక్కలలోకంలో ఆ ప్రకృతి సౌందర్యంలో తెల్లని వెన్నెలలో ఓలలాడుతూ ప్రపంచం మరచిపోయేది. ఆయన విరహగీతికలు చదివి విరహిణిలా విలపించేది. ఒంటరితనం కోరుకునే తనకు స్నేహితులుకూడా వుండేవారుకాదు.

అక్క, అన్న పెళ్లిళ్లయిపోయాయి. తనకి పెళ్లికాదని తెలిసీ తల్లీ, తండ్రీ చేసే ప్రయత్నాలకు నవ్వుకునేది.

ఎవరైనా తన అందంచూసి ముచ్చటపడినా తను మూగదని తెలిసేసరికి ఒక్క నిరసనచూపు విసిరి లేచిపోయేవారు.

చివరికి తనకి పెళ్లి కుదిరింది.

తన జీవితం ధన్యమైపోయిందనుకుంది. పెళ్లి తన జీవితధ్యేయమనికాదు.

తల్లిదండ్రులకు తన బరువు ఆ రకంగా తీరిపోతున్నందుకు కాస్త తృప్తి. అందుకే అమ్మలక్కలు రెండో పెళ్లివాడు - పోలియోవల్ల ఒక కాలు చచ్చుబడినవాడు అని చెవులు కొరికేసినా తనకేమీ అనిపించలేదు.

అత్తగారు, ఆడపడుచులు గంపగయ్యాళులు - రాక్షసి మూక అనే వార్త తెలిసినా తల్లీదండ్రీకూడా పెద్ద పట్టించుకోలేదు.

మొదటిభార్యది సహజమైన చావుకాదనే వాదు వినీ తెలియనేట్ట వుండిపోయారు. అంతా.

వాళ్లకి కావలసింది ఒక్కటే -

తనకి పెళ్లయి వాళ్ల బాధ్యత వదిలిపోవడం.

పెళ్లయ్యాక తెలిసింది. జీవితంలో ఏ కాస్త సంతోషమైనా తననుభవించిందీ అంటే అది పెళ్లికి ముందే అని -

పరీక్ష పాసయినప్పుడు -

చిన్న చిన్న గేయాలు రాస్తున్నప్పుడు అవి అచ్చులో కనిపించినప్పుడు-

కృష్ణశాస్త్రిగారి సాహిత్యం చదువుతున్నప్పుడు

తనకి ఆనంద ఘడియలే -

కాని అవి జీవితంలో ఇకమీదట మచ్చుకైనా కనిపించవు అని తెలిసిపోయింది.

అత్తగారికి తనంటే ఎందుకు కోపమో తనకిప్పటికీ అర్థంకాదు.

అసలు తనని చూస్తే అందరికీ కూడా ఎందుకు కోపమో తనకెప్పుడూ అర్థంకాదు.

తను మూగగా పుట్టడం తన తప్పుకాదు.

అందంగా వుండం తన తప్పుకాదు.

భర్తకనుగుణంగా నడుచుకోగలగడం తన తప్పుకాదు.

పెళ్లిళ్లయి అత్తారిళ్లకి వెళ్లిపోయిన ఆడబడుచులది అదేవూరు కావడంతో చీటికీ మాటికి అక్కడే వుండి తనని రకరకాలుగా

ఏడ్పించేవారు.

తను నోరెత్తదు అని తెలిసి మరీ అలుసైపోయింది. వాళ్లకెన్ని మర్యాదలు చేసినా సేవలు చేసినా తృప్తి కలిగేదికాదు.

తన అందం చూసి వాళ్లకెందుకో కడుపు మంటగా వుండేది. అత్తగారికి కూతుళ్ల మాట వేదవాక్కు. అవిటి కొడుక్కి ఒక జీతం బత్తెంలేని పనిమనిషి దొరికిందని ఆనందంగా వున్నా అస్తమానం ఏడిపించుకుతినేది.

ఆ ఇంట ఒకే ఒక్క మనిషి నిశ్చలంగా వుండే మనిషి మామగారు.

ఒక రుషిలా వుండేవాడు.

తనకు మూగతనం ప్రకృతి ప్రసాదించినదైతే ఆయన కావాలని ఎందుకు తెచ్చిపెట్టుకున్నాడో మరి.

పెళ్లయిన ఆరేళ్లలో ఆయన నోట నాలుగైదు మాటలకంటే ఎక్కువ వినలేదు.

భర్తకి తనపట్ల ఉన్నది ప్రేమో, అభిమానమో, స్వార్థమో తెలియదు.

అక్కచెల్లెళ్లు, తల్లి బాధపడతారని వాళ్ల ధాటికి తట్టుకోలేక తనమీద అధార్టీ చెలాయించేవాడు.

బారెడు జడని అక్కసుతో కత్తిరించింది చిన్నాడబడుచు. అసూయ అంత పని చేయించింది అని తనకి తెలుసు. కాని మోడరన్‌గా తయారవాలని సాకుకోసం తనే అలా కత్తిరించేసుకుందని అబద్ధం చెప్తుంటే ఆ అసూయకి పరాకాష్ఠ అర్థమయింది.

కాని భర్త అప్పటికే ఉగ్రనరసింహుడయ్యాడు.

తన తల్లీ దండ్రీ ఒకే ఏడాదిలో పోవడం - అన్న అక్క కూడా స్వార్థంతో ఒక్కసారికూడా తనవంక చూడకపోవడంతో తను మరింత లోకువైపోయింది.

తన తిండి దండగలా అనిపించేది.

తన బట్ట అనవసరంగా వుండేది.


అన్నిటికంటే బాధాకరం - తన కన్న బిడ్డ రాహుల్ తనపట్ల ద్వేషం పెంచుకోవడం.

ఐదేళ్ల బాబు మాటలు విని తనకెంతో మురిపెంగా వుండేది. కాని అత్తగారు చాలా తెలివైనది.

చిన్నప్పట్నుంచీ వాడిని చేరదీసి తనమీద ద్వేషం నూరిపోయడంతో ఆ పసి మనసులో విషబీజాలు మొలకెత్తాయి.

వాడు తనని చూసి మూగది, పిచ్చిది అని వెక్కిరిస్తుంటే తను విలవిల్లాడిపోయేది.

వాడలా వెక్కిరిస్తుంటే పకపకా నవ్వేవారు అత్తా, ఆడబడుచులు.



చిన్నప్పటినుంచి వరమో శాపమో సహనంగా వుండడం వాళ్లకి మరీ కంటగింపయింది.

తను మనసారా ఏడిస్తే వాళ్లకి తృప్తి.

కాని ఎంతో కష్టం కలిగితే తప్ప పైకి దుఃఖం ప్రకటించేదికాదు. వాళ్లకి వెర్రెక్కిపోయి పిల్లవాడిని రెచ్చగొట్టేవారు. తెలిసీ తెలియని లేతమనసుతో వాడు తన మాటలతో తన మనసును తూట్లు పొడిచేవాడు.

జీవితంలో ఎన్నడూ కలుగనంత దుఃఖం కలిగేది. జీవితంలో తన చివరి ఆశ కన్నబిడ్డ - అదికూడా పోయింది. తనెందుకు బ్రతకాలి. ఎవరికోసం బ్రతకాలి? భర్తకి తను చాకిరీ చేసే యంత్రం తప్ప ప్రేమ లేదు. మిగిలినవాళ్లకి తనొక ఆటబొమ్మ - కీ ఇస్తే ఆడే బొమ్మ. చిన్నప్పటినుంచి ఎంత దుఃఖం కలిగినా పైకి ప్రకటించడం తనకలవాటులేదు. అదే తన పాలిటి శాపం అయింది.

ఒక్కొక్కప్పుడు అనిపించేది. తను భోరున ఏడిస్తే ఎదుటివాళ్ల ఈగో తృప్తిపడి తన జోలికి రారేమో! కానీ తనకది చేతకాలేదు.

బొయ్యిన హారన్ మోగడంతో ఉలిక్కిపడింది అనూష. కారు సరిగ్గా ఆమె పక్కనే ఆగింది.

మాసిన చీర - రేగిన జుట్టు - పీక్కుపోయిన మొహం - లోతుకు పోయిన కళ్లతో పిచ్చిదానిలా వున్న ఆమెనెక్కించుకుని కదిలిన కారుకేసి అంతా చిత్రంగా చూశారు.

'అమ్మా అనూషా' జడ్జి రామచంద్రరావుగారి కంఠంలో అపారమైన వాత్సల్యం పొంగుతోంది.

'మీ అత్తగారిని హత్యచేసేందుకు ఎందుకు ప్రయత్నించావో ఇప్పుడైనా చెప్తావా?'

ఆయన కంఠంలో వినిపించిన కారిన్యానికి అబ్బురపడ్డా. అంతలోనే తేరుకుని నిర్మలంగా నవ్వింది అనూష.

ఆ నవ్వు విని హాయిగా నిట్టూర్చాడాయన.

'హవ్మయ్యా నువ్వా హత్యాప్రయత్నం చేయలేదు. అంత నిర్మలత్వంలో మచ్చ వుండేందుకు వీలులేదు. అందుకేనమ్మా! నువ్వు ఏ సమాధానం చెప్పకుండా వ్రాసేందుకు ఇష్టపడకపోయినా నీ తరపున సిన్సియర్‌గా పనిచేసే లాయర్‌ను నియమించాను. ఎంక్వయిరీలో ఏ ఒక్కరూ నీకు వ్యతిరేకంగా చెప్పలేదు. చివరికి ఆస్పత్రిలో మధ్యలో కాస్త తెలివొచ్చిన నీ అత్తగారుకూడా - అందుకే నీకు విముక్తి లభించింది.

అనూష వింటోంది. అంటే అత్తగారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నమాట.

'ఇప్పుడెక్కడకెడుతున్నావమ్మా'

మంగళసూత్రం చూపించింది అనూష.

'నిన్ను వాళ్లు రానిస్తారా?' ఆయన గొంతులో ఆవేదన.

అనూష ఏ భావం వ్యక్తంకాని చూపు చూసింది.

'సరిగ్గా అదే చూపు నా కూతురు రాజ్యానిదికూడా. నీలాగే నోరులేదు. ఆమెను నిర్దాక్షిణ్యంగా డబ్బుకోసం చంపేశారని తెలిసీ జడ్జినైయుండీ ఏం చేయలేకపోయాను. ఆ పాపిష్టివాళ్ళు తెలివైనవాళ్లవడంతో అందుకే రాజ్యంలాంటివాళ్లెవరు కనిపించినా...'

ఆయనగొంతు పూడుకుపోయింది దుఃఖంతో.

'వాళ్లకు వీలైనంతవరకు న్యాయం చేకూర్చాలని చూస్తాను. వెయ్యిమంది దోషులు తప్పించుకున్నా ఒక్క నిరపరాధికూడా అదీ నీలాంటి అభాగ్యురాలు శిక్షింపబడకూడదని నా ఆరాటం. నీకిష్టమైతే మా ఇంటికి వచ్చెయ్యి తల్లీ. బిడ్డను పోగొట్టుకున్న అభాగ్య జీవులం నేనూ నా భార్య. నిన్ను కన్న బిడ్డల్లా చూసుకుంటాం'

నమస్కారం చేసింది అనూష. అది కృతజ్ఞత సూచకంగా తప్ప అంగీకారం కాదని అర్థమైన ఆయన కారు ఆపారు.

వెళ్లొస్తానని సైగచేసి వెనుదిరిగి చూడకుండా

వెళ్లిపోతున్న అనూషను చూసి ఆయన గాఢంగా నిట్టూర్చారు. 'అదే నడక, అదే అభిమానం'

ముందుకు నడిచి తన ఇంటి సందులోకి తిరిగిన అనూష మనసులో ఒకే ఒక కోరిక - చివరి కోరిక -

తన కొడుకు తనసెంత అసహ్యించుకున్నా ఫరవాలేదు. రాహుల్‌నొక్కసారి కళ్లారా చూడాలి.

వీధి చివర బడ్డీలోని షాపువాడు తనని గుర్తించి దెయ్యాన్ని చూసినట్టు చూస్తుంటే నిట్టూర్చింది అనూష.

ఆరోజు తను స్పృహ తప్పబోతుంటే జనం మాటలు తన చెవిన బడ్డాయి.

'పైకి మంచిదానిలా ముంగిలా వుండి ఎంత పని చేసింది మూగది?'

'అమ్మో గుండెలు తీసిన బంటు. ఎంత ఆరళ్లు పెడితే మాత్రం అత్తగారిమీద కిరసనాయిలు పోసి తగలబెట్టాలని చూస్తుందా?'

'ఓర్నాయనో సమయానికి ఆవిడ కూతురు ఏదో పనిమీద వచ్చి కేకలు వెయ్యకపోతే ముసల్ది నిలువునా కాలిపోయేది'

'మంటలార్పుతున్నట్టు ఎంత నటించింది అందరూ రాగానే'

'నయమే రేపు మొగుణ్ణికూడా తగలెట్టేస్తుంది కోపం వస్తే'

'అందుకే అంటారు భగ్గుపాటివారి పంచన వుండొచ్చుటగాని వాలివుముచ్చువాళ్ల నట్టింట వుండకూడదని.

స్పృహ వచ్చాక తను జైలులో వున్నట్టు తెలిసింది. అక్కడక్కడా కాలిన గాయాలకి జైలువాళ్లే చికిత్స చేయించారు తనకి.

కోర్టు హాల్లోకూడా తనని చూడగానే అంతా భయంగా బెదురుగా అసహ్యంగా చూసేవారే.

తనవాళ్లు - భర్త - బిడ్డ - ఆడబడుచులు ఎవరూ కోర్టుకి రాలేదు. అసలు తనేమయినా వాళ్లకక్కరలేదు.

బాబుకి కూడా తనని చూడాలనిపించలేదా. పసివాడుకదా!

అత్తింట్లోకి అడుగుపెడుతూ ఒక్కసారి పరికించింది అనూష. హాల్లో పడక్కుర్చీలో కూర్చున్న మామగారు ఒక్కసారి తలెత్తి కళ్లజోడు తీసి చూసి మరీ పేపరు చదవడంలో మునిగిపోయారు. ఆయన కాక లోపలేమీ అలికిడి లేదు.

తనెంతో ఊహించింది. కోలుకుంటున్న

## చేసేది

''నేను చేసేది మా ఆవిడకి నచ్చడంలేదురా!''

''ఏం చేస్తున్నావు? ఆఫీసు అయిన తర్వాత ఊరంతా బలాదూరు తిరిగి రాత్రి ఆలస్యంగా ఇంటికి వెళ్తున్నావా?''

''అంత అదృష్టమా? నేను చెప్పేది, నేను చేసే వంట గురించి!''

పి.నాగభూషణం (అమలాపురం)



అత్తగారు - ఆడబడుచులు భర్త అక్కడ మరో కోర్టుచేసి తనని దుమ్మెత్తిపోసి తనమొహంమీద ఉమ్మి - జుట్టుపట్టి బయటకీడుస్తారు అని - అయినా రాహుల్‌నొక్కసారి చూసి...

కాని శ్మశానంలా వుందా ఇల్లు.

కొంపదీసి అత్తగారికేమీ అవలేదుకదా!

లోపల గదిలో అడుగుపెట్టిన అనూష ఉలిక్కిపడింది. ఆమె గొంతునుండి భయంతో కూడిన కేక వెలువడింది కీచుగా.

ఆ మంచంమీద -

ఈగలు ముసురుతున్న గాయాలతో కాలిపోయి భయంకరమైన మొహంతో -

మాగిన కుళ్లు కంపు కొడుతున్న గుడ్డల మధ్య మూటలా శవంలా పడుంది అత్తగారు.

కళ్లకి గుడ్డ.

ఆమె కేక విన్న అత్తగారిలో చలనం లేదు.

లోపల్నుంచి వంటగరిటతో బయటకొచ్చిన భర్త వచ్చి అనూషను చూసి ఏమీ అనలేదు.

'అమ్మకి కళ్లు పోయాయి'

వెంటనే అనూషలోని స్త్రీమూర్తి మేలుకొంది. చేతిలో మూటను అక్కడే పడేసి నడుం బిగించింది.

ఆ తర్వాత పనిలోకి దిగిపోయింది.

ముందు చకచక కుళ్ళు బట్టలు తీసి అలమారలోంచి ఇస్త్రీ దుప్పటి తీసి పరిచింది. దిండు కవర్లు మార్చింది.

ఎప్పుడో నేర్చుకున్న నర్సింగ్ ఇప్పుడు పనికొచ్చింది. గబగబా వేణ్ణీళ్లు పెట్టి పుళ్లమీది గాజుగుడ్డను నెమ్మదిగా తీసి మళ్లీ డ్రెస్సింగ్ చేసింది.

మధ్యమధ్యలో తెలివొచ్చి కదులుతున్నా అత్తగారు గుర్తుపట్టడంలేదు. ఆమెకికూడా మరో ఉతికిన చీర కప్పి పాతచీర పక్కన పడేసింది.

బలవంతాన లేపి కాస్త మజ్జిగన్నం తినిపించింది. తిని మగతగా పడుకుందావిడ.

వంటిల్లు శిథిలావస్థలో వున్నట్టుంది. ఇల్లంతా ఎలుకలు, బొద్దింకలు - స్టవ్‌నిండి పొంగిపోయిన పదార్థాల మరకలు - నీచు వాసన గది అంతా.

సాయంత్రంగాని ఇల్లు ఓ కొలిక్కి రాలేదు. ఇన్ని పనులు చేస్తున్నా అనూష కళ్లు ఆర్తిగా వెతుకుతూనే వున్నాయి.

'స్కూలుకెళ్లాడు' ఆమె ఎవరికోసం వెతుకుతుందో అర్థమైన భర్త అన్నాడు.

'నేనలా బయటికెళ్తాను' ఎవరికో చెప్పినట్టు చెప్పి వెళ్తున్న భర్తను అలాగే చూసింది అనూష.

ఆమెకు నీరసం వచ్చింది. పొద్దుటినుంచి పచ్చి మంచినీళ్లుకూడా తాగలేదు. పనిచేస్తున్నంతసేపూ తెలియలేదు ఆకలి.

ఎవరో లోపలికి తొంగిచూసినట్టనిపించింది అనూషకి.

పక్కింటి సూర్యకుమారి వంటింట్లోకి వచ్చేసింది.

'ఎంత చిక్కిపోయావక్కా' ఆ పిల్ల కళ్లల్లో నీళ్లు.

అనూషంటే ఆ పిల్లకి ఇష్టం. నోరువిప్పి మాట్లాడకపోయినా అనూష నవ్వు ఎన్నో సమాధానాలిస్తుందని అలా ఏదో చెప్పుకుపోతూనే వుండేది. ఇప్పుడూ అంతే.

'అక్కా నిన్ను పెట్టిన ఉసురు ఊరికే పోలేదు. ముసల్దాన్ని చూశావుగా - చచ్చినదానిలా దిక్కులేక అలా పడుంటుంది. నువ్వున్నప్పుడు రోజూ ఇక్కడ తిష్టవేసి తల్లితో ఇచ్చికాలాడే కూతుళ్ళు తల్లి చచ్చిపోతుందని బంగారం వాటా తీసుకుంటూ దెబ్బలాడుకున్నారు. కాని అది తాకట్టులో వుందని తెలిసి తల్లి చావదని తెలిసి చాకిరీ చేయాల్సి వస్తుందని రావడమే మానేశారు. మీ ఆయనే విసుక్కుంటూ తిట్టుకుంటూ ఏదో చేతనైనట్టు చేసిపడేస్తాడు. ఆ గడ్డం అదీ చూశావా? పిచ్చాడిలా అయిపోయాడు [illegible] ఎప్పుడూ బువ్వే పెడితే తింటాడు

లేకపోతే ఆకుర్చీలో అలాగే నిద్రపోతాడు. పోలీసులు మాత్రం అందరినీ నానాహింసలూ పెట్టి విషయాలు రాబట్టేరులే.

అనూష చెవికి మాటలేం పట్టడంలేదు. బా...బు...

అనూషగుండె దడదడలాడింది. బాబుకూడా చిక్కిపోయి వుంటాడు ఆలనా పాలనా లేక.

'నాన్నా' అంటూ కిచెన్‌లోకి వచ్చినవాడల్లా తల్లిని చూసి భూతాన్ని చూసినట్టు పారిపోయాడు రాహుల్. అనూష మనసు విలవిల్లాడింది.

తనిక్కడికి ఎందుకొచ్చింది? ఏం చేస్తోంది? తననెవరూ రమ్మనలేదు. పొమ్మనలేదు.

భర్త ప్రవర్తనలో పని తప్పిన ఒక రిలీఫ్ కనిపించింది. హాల్లోకి అడుగుపెడుతున్న అనూష కాళ్లు అక్కడే ఆగిపోయాయి. మామగారి పొట్టమీదకెక్కి అడుగుతున్నాడు రాహుల్.

'అమ్మ చచ్చిపోలేదా తాతా! మరి పోలీసులు అమ్మని చంపేస్తారు అని అత్తలు చెప్పారే?'

తాతనుంచి ఏం సమాధానం వచ్చిందో?

ఆ రాత్రి కొంగు పరచుకుని పడుకున్న అనూషకి నిద్రపట్టే ముందు ఒక్కటే అనుకుంది.

తన రాహుల్‌ని చూసేసింది. తను వచ్చిన పని అయిపోయింది. ఇక తను ఎక్కడ చనిపోయినా ఫరవాలేదు. వెళ్లిపోవాలి'

కాని ఒక రాత్రివేళ తన పక్కలో ఎవరో పడుకున్నట్టనిపించి ఉలిక్కిపడింది. కాని ఆ స్పర్శ అది... తనకెంతో ప్రియమైనది. కాసేపు అలాగే ఆ హాయిననుభవిస్తూ వుండిపోయింది.

'అవమ్మా' తనని కదుపుతున్నాడు నిద్రపోతోందనుకుని.

'ఊ' అనూష మనసు గాలిలో తేలిపోతోంది.

'నువ్విది చెప్పు. ఆరోజు నేను బాత్‌రూంలోంచి చూశాను. మామ్మే నీమీద కిరసనాయిల్ పోసేసింది. కానీ నువ్వెందుకు చెప్పలేదు? మంటలుచూసి భయమేసి అక్కడే నిద్రపోయాను.

అనూషకి గుండె గొంతుకలోకి వచ్చేసింది. తన గుండెలోనే దాగిన రహస్యం అది.

ఆరోజు ఇంట్లో ఎవరూ లేకుండా చూసి అత్తగారు తనమీద కిరసనాయిలు దిమ్మరించబోయింది. కాని ఎలా జరిగిందో డబ్బా జారిపోయి ఆమె మొత్తం తడిసిపోయింది. తనకోసం వెలిగించిన కొవ్వొత్తి ఆమె కొంగుకు ముద్దెట్టుకుంది.

## మాధురీ సెంటు



సినీ హీరోయిన్ మాధురీదీక్షిత్ ఇక మీ శరీరానికి హత్తుకుని సువాసనలు వెదజల్లుతుంది. ఫ్రెంచి సువాసనల తయారీ సంస్థ మాధురి పేరుతో సెంట్‌లని మార్కెట్‌లోకి దింపుతున్నారు. ఒక అంతర్జాతీయ సంస్థ ఇండియన్ సినీ హీరోయిన్ పేరుమీద సెంటు దింపడం ఇదే ప్రథమం. ఎలిజబెత్ టేలర్, గాబ్రియాలా సబాటిని పేరుతో సెంటులు దిగాయి. జీనత్ అమన్ పేరుతో మన దేశంలో సెంట్లు దిగాయి కాని ఆదరణ పొందలేదు.

- మదన్

తనెంత అరిచినా కేకలు గట్టిగా వినిపించవు. అయినా శక్తిమేర అరుస్తూ దుప్పట్లు ఆవిడకి కప్పే ప్రయత్నం చేసింది. కాని ఆవిడ గాభరాలో అటూ ఇటూ పరుగెత్తింది. ఇంతలో నాటకీయంగా తన చావు చూడాలని వచ్చిన ఆడపడుచు ప్లేటు ఫిరాయించి నేరం తనమీదకి తోసేసింది. తనకి స్పృహతప్పి పోయింది.

మెలకువ వచ్చి తనని అరెస్టు చేశారని తెలిసి మొద్దుబారిపోయిన తన మనసు చలించలేదు.

తనకెవరున్నారని - ఎవరికి తను కావాలని తన జీవితంకోసం నిజం చెప్పడం? కాని జడ్జిగారు తనని వదలలేదు.

కాని చిన్నారి రాహుల్ - తన కొడుకు తనని గుర్తించాడు. తన నిజాయితీ గుర్తించాడు.

భర్తకీ, మిగిలినవాళ్లకీ నిజం గ్రహించగలిగినా ఒక్కరూ నోరు విప్పలేదు. కాని...

తన రాహుల్-

'అమ్మా ఏం మాట్లాడవు? నువ్వు ఇంకా చచ్చిపోలేదుగా. అందరిలాగే నాకూ అమ్మకావాలి. తను మాట్లాడలేనని మొదటిసారి మర్చిపోయింది. అనూష - ఏవో విచిత్ర శబ్దాలు చేస్తూ కొడుకుతో అర్ధరాత్రి మాట్లాడుతున్న అనూషను చూస్తూ విభ్రాంతులయ్యారు ఆమె భర్త, మామగారు.

